సాక్షి
మంచిర్యాల

శనివారం : 27 : ఏప్రిల్ : 2024



'పీడీ'కిలి బిగిస్తున్నారు!

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు ప్రత్యేక దృష్టిసారించారు. నేర రహితంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. IIలో▸



బీజేపీలో సమన్వయకర్తలు

బీజేపీ పార్లమెంట్ సెగ్మెంట్ వారీగా సమన్వయ కర్తలను నియమించింది. ఆదిలాబాద్‌కు దుగ్యాల ప్రదీప్‌రావు, పెద్దపెల్లికి చిట్యాల సుహాసినిరెడ్డిలకు బాధ్యతలు అప్పగించింది. IIలో▸

గరిష్టం/కనిష్టం
42.6 /29.5

వాతావరణం

చాలావరకు ఎండగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మబ్బు పడుతుంద. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఏజీపీగా శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది చొప్పదండి శ్రీనివాస్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా నియామకం అయ్యారు. బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్న శ్రీనివాస్‌ను ప్రభుత్వం ఏజీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఏజీపీ శ్రీనివాస్‌కు బార్ అసోషియేషన్ తరఫున సత్కరించారు. ఏజీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తనను గుర్తించి ఏజీపీగా నియామకం చేయడం ఆనందంగా ఉందన్నారు. తన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి బార్ అసోషియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రాజేశ్, కోశాధికారి సునీల్, సీనియర్ న్యాయవాదులు టి.గోపీకిషన్‌సింగ్, ఎల్.రాము, బాలకృష్ణ, గోలి శ్రీనివాస్, నరసింహారావు, రవి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షలకు 215 మంది గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు శుక్రవారం 215 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ టెన్త్ పరీక్షలకు 639 మంది గాను 530 మంది హాజరు కాగా 109 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 1,141 మంది విద్యార్థులకు976 మంది హాజరుకాగా 165 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్, డీఈవో యాదయ్య పరిశీలించారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు 08 కేంద్రాలను తనిఖీ చేశాయి.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

జన్నారం: జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అటవీ శాఖ అధికారులు విధించిన ఆంక్షలు ఎత్తివేసే అంశంపై ఈనెల 28న మేధావులు, స్వచ్ఛంద సంఘాలు, యువకులు, తదితరులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సామాజికవేత్త భూమాచారి పేర్కొన్నారు. వ్యాపారులు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్



బహుమతులు అందజేస్తున్న శ్రీధర్

నస్పూర్: తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాధన ఎక్సలెన్సియా పాఠశాల ఆవరణలో ఈనెల 24న ప్రారంభమైన తెలంగాణ స్టేట్ ఫస్ట్ లెవెల్ హ్యాండ్ బాల్ ప్రీమియర్ లీగ్ -2024 పోటీలు శుక్రవారంతో ముగిశాయి. పురుషుల విభాగంలో వరంగల్ జట్టు మొదటి స్థానంలో, రెండు, మూడు స్థానాల్లో హైదరాబాద్, ఆదిలాబాద్ జట్లు నిలిచాయి. మహిళల విభాగంలో మొదటి స్థానంలో కరీంనగర్, రెండు, మూడు స్థానాల్లో హైదరాబాద్, మహబూబ్‌నగర్ జట్లు నిలిచాయి. విజేతలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల శ్రీధర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ టీం హ్యాండ్‌బాల్ కోచ్, టోర్నమెంట్ కన్వీనర్ బొడ్డు విష్ణువర్ధన్, జిల్లా సెక్రెటరీ తూండ్ల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేంసాయి పాల్గొన్నారు.

అవసరమైతేనే బయటకు రావాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతేనే మధ్యాహ్నం వేళల్లో బయటకు రావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బారాయుడు సూచించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ యూపీహెచ్‌సీని శుక్రవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే వారికి వడదెబ్బపై అవగాహన కల్పించాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనులు ఉదయం 11 గంటల లోపు సాయంత్రం 4 తర్వాత చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.



తాండూర్‌లో బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ



దేవాపూర్‌లో ప్రచారంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ప్రచార వేడి!

- మిగిలింది 15 రోజులే..
- వేగం పెంచిన అభ్యర్థులు
- బహిరంగ సభలకు ప్లాన్
- గెలుపే లక్ష్యంగా ముందుకు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ముగియడంతో ప్రచారం ఊపందుకుంది. ఓవైపు ఎండ తీవ్రత పెరుగుతున్నా పోలింగ్‌కు ఇంకా పక్షం రోజులే ఉండడంతో అభ్యర్థులు వేగం పెంచారు. ప్రచార రథాలు గ్రామాలు, పట్టణాల్లో మైకులతో తిరుగుతున్నాయి. అభ్యర్థులు సైతం ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు జనం మధ్యే ఉంటున్నారు. సభలు, సమావేశాలు, రోడ్‌షోలు, కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. చేరికలను ప్రోత్సహిస్తున్నారు. కుల సంఘాలు, ప్రభావిత వ్యక్తులు, మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతీ బూత్ స్థాయిలో ఇన్‌చార్జీలను నియమించారు. నియోజకవర్గ, జిల్లా, పార్లమెంట్ పార్టీ కార్యక్రమాలను బాధ్యులు పర్యవేక్షిస్తున్నారు. వేడుకలు, శుభ కార్యాలు, పెళ్లిళ్లకు హాజరవుతున్నారు.

బహిరంగ సభలకు ఏర్పాట్లు

ఎన్నికల సమరంలో బహిరంగ సభలకు అన్ని రాజకీయ పార్టీలు ప్లాన్ చేస్తున్నాయి. ఈ క్రమంలో వచ్చే వారంరోజులు రాష్ట్ర, జాతీయస్థాయి నాయకులు జిల్లాకు రానున్నారు. జిల్లా కేంద్రంతోపాటు, నస్పూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శనివారం ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తోంది. పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు హాజరుకానున్నారు. మంచిర్యాల ప్రేమ్‌సాగర్‌రావు, బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు వినోద్, వివేక్‌తోపాటు ఆ పార్టీ అభ్యర్థి వంశీకృష్ణ ప్రచారం చేస్తున్నారు. వీరితోపాటు ప్రచారం ముగిసే నాటికి మరో ఓ భారీ బహిరంగ సభకు ప్లాన్ చేస్తున్నారు.

4న కేసీఆర్ రోడ్‌షో

మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మంచిర్యాలకు మే 4న చేరుకోనుంది. ఈ సందర్భంగా పట్టణంలో ఆయన రోడ్‌షో నిర్వహించనున్నారు. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఉదయం మార్నింగ్ వాకర్స్‌తో కలుస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ప్రధాన పట్టణాల్లో స్థానిక యువత, మహిళలతో సంభాషిస్తున్నారు. బొగ్గు గనులపై కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. రోజు వారీగా జిల్లాలో ప్రచారం చేస్తున్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

తాండూర్/కాసిపేట: పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. తాండూర్ మండలం తాండూర్, రేచిని , అచ్చులాపూర్ గ్రామాల్లో, కాసిపేట మండలం ముత్యంపల్లి, కాసిపేట, దేవాపూర్, కొండాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ ఎంపీ వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, ఇతర నాయకులతో కలిసి మండలానికి చేరుకున్నారు. కిష్టంపేట అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి మండల కేంద్రం మీదుగా తాండూర్ వరకు మోటర్ బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్‌షో చేశారు. ప్రచార కార్యక్రమాల్లో వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్, నాయకులు మాట్లాడారు. సింగరేణి నష్టాల్లో ఉన్నప్పుడు కాపాడింది కాకా వెంకటస్వామి అని అన్నారు. ఆరు గ్యారంటీల్లో చాలా వరకు అమలు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే మిగిలిన హామీలను అమలు చేస్తామన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎండీ.ఈసా, ఎంపీటీసీ సిరంగి శంకర్, సింగిల్ విండో డైరెక్టర్లు గట్టు మురళీధర్‌రావు, మాసాడి తిరుపతి, మాజీ డైరెక్టర్ పెద్దబోయిన శంకర్, రంజిత్, రత్నం ప్రదీప్, రాపర్తి శ్రీనివాస్, శంకర్, ఉత్తూరి సత్తయ్య పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ పాలనలోనే అన్నివర్గాలకు న్యాయం'

కాసిపేట: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేసిందని ఆ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని దేవాపూర్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఓరియంట్ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులతో మాట్లాడారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలతో పేదలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, జెడ్పీటీసీ చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

తమ్మీ.. తప్పుకో..

'అన్న నామినేషనైతే వేశాం.. నియోజకవర్గమంతా తిరిగి ప్రచారం చేయడం మనవల్ల కాని పని.. ప్రధానపార్టీ అభ్యర్థి ఎవరైనా నామినేషన్ విత్‌డ్రా చేసుకోమని మంచి ఆఫర్ ఇస్తే సిద్ధంగా ఉన్నాం..'
– కొందరు అభ్యర్థులు.. ప్రధాన పార్టీ అభ్యర్థులతో ఇలా మంతనాలు సాగిస్తున్నారు.

'అసలే ఎండలు దంచికొడుతున్నాయి.. దీనికి తోడు ప్రచార ఖర్చు తడిసిమోపడవుతున్నది. పెద్దపల్లి ఎంపీకి ఏకంగా 63మంది నామినేషన్ వేశారు. సుమారు 4ఈవీఎంలు ఉపయోగిస్తారు. వీటిని చూసి ఓటర్లు తికమకపడే అవకాశాలున్నాయి. సాధ్యమైనంత మందిని విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నాలు చేద్దాం'
– తమ ముఖ్య అనుచరులతో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రణాళికలు ఇవీ.

- 15కు మించితే రెండు ఈవీఎంలు
- ఈవీఎంలు ఎక్కువైతే ఓటర్లు తికమకపడే అవకాశం
- నామినేషన్ల ఉపసంహరణ కోసం నేతల మంతనాలు



సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల్లో గెలుపు కోసం అన్నిపార్టీల నేతలు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా ఏఒక్క చిన్నవిషయాన్ని వదలకుండా వ్యూహ్యాలు రచిస్తున్నారు. ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులకు మించితే రెండు ఈవీఎంలు ఉపయోగించాల్సి ఉంటుంది. కానీ పెద్దపల్లి ఎంపీ స్థానం నుంచి 63 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఘట్టం పూర్తయ్యింది. రిటర్నింగ్ అధికారులు శుక్రవారం నామినేషన్లు పరిశీలించారు. పార్లమెంట్ నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థుల నామినేషన్లను వివిధ కారణాలతో రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. తిరస్కరించిన వాటిలో 24 నామినేషన్లు ఉన్నాయి. 49 మంది నామినేషన్లు సరిగా ఉన్నట్లు ప్రకటించారు. సోమవారం నాటికి అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరించుకోని పక్షంలో 4 ఈవీఎంలను ఉపయోగించాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో పోలింగ్ రోజు ఓటర్లు తికమకపడే అవకాశం ఉంది. అలాగే అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు వివరించడంలో ఇబ్బందులుపడే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు ఉండేలా తెరవెనకాల ప్రయత్నాలు సాగిస్తున్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు, వారితో సన్నిహితంగా ఉండేవారితో రాయ'బేరాలు' కొనసాగిస్తున్నారు.

ఉపసంహరణకు యత్నాలు..

- నామినేషన్ల ఉపసంహరణకు సోమవారంతో గడువు ముగియనుంది.
- ఈనేపథ్యంలో ఎన్నికల బరిలో నుంచి స్వతంత్రులుగా పోటీచేసిన అభ్యర్థులతో కొందరు మంతనాలు సాగిస్తున్నారు.
- ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక ఈవీఎంలో 16 గుర్తులు ఉండగా, చివరన నోటాకు కేటాయిస్తారు.
- పోటీలో 15 మందికి మించితే రెండోఈవీఎంనూ ఉపయోగించాల్సి ఉంటుంది.
- పెద్దపల్లి ఎంపీ స్థానంలో 49 మంది బరిలో ఉండగా, 34మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకోవాల్సి ఉంటుంది. దీంతో వివిధ పార్టీలకు చెందిన ముఖ్యనేతలు స్వతంత్ర అభ్యర్థులకు తాయిలాలు చూపి తప్పుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి ప్రయత్నాలు ఏమేరకు ఫలించనున్నాయో సోమవారం తేలనుంది.

14 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణ



నామినేషన్లు పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి లోక్‌సభ స్థానానికి దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తయిందని పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. పెద్దపల్లి స్థానానికి ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు 63మంది అభ్యర్థులు 109 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని పేర్కొన్నారు. శుక్రవారం నామినేషన్ పత్రాల పరిశీలన పూర్తయిందని, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సక్రమంగాలేని 14మంది అభ్యర్థుల నామిషన్లను తిరస్కరించినట్లు వివరించారు. మిగతా 49మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని ఆయన వివరించారు.

కూలీలకు సరైన వేతనం అందాలి

వేమనపల్లి: ఉపాధిహామీ కూలీలకు గరిష్ట వేతనం రూ.300 అందేలా చూసి కొలతల ప్రకారం పనులు చేయించాలని డీఆర్డీఈవో కిషన్ సూచించారు. వేమనపల్లి మండలం గొర్లపల్లి గ్రామపంచాయతీలో నిర్మాణంలో ఉన్న చిన్ననీటి కుంట పనులను శుక్రవారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేసుకోవాలని సూచించారు. పని స్థలాల వద్ద మంచినీరు, షేడ్‌నెట్, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఎండ వేడి అధికంగా ఉన్నందున ఉదయం పూటే పనులకు వచ్చి 10 గంటల వరకు పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో పంచాయతీరాజ్, ఉపాధిహామీ, ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. హరితహారం మొక్కలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీఆర్డీవో దత్తరావు, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఈసీ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



కూలీలకు చల్లటి నీరు అందజేస్తున్న డీఆర్డీవో

రేపు కబడ్డీ ఎంపిక పోటీలు

నస్పూర్: జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు ఈనెల 28న శ్రీరాంపూర్ ఏరియాలోని విశ్వశాంతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజేంద్రపాణి తెలిపారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే జిల్లా ప్రీమియర్ లీగ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆదివారం ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డు, రూ.1000 ఎంట్రీ ఫీజుతో పీఈటీ సదానందంకు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9849124856 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలింగ్ సిబ్బంది రెండోవిడత ర్యాండమైజేషన్ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీర్ నైరంతర్య సమక్షంలో అదనపు కలెక్టర్ బి.రాహుల్, మంచిర్యాల ఆర్డీవో వి.రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళలతో కలిసి పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. చెన్నూర్ నియోజకవర్గంలో 227, బెల్లంపల్లి నియోజకవర్గంలో 227, మంచిర్యాల నియోజక వర్గంలో287 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మూడు నియోజకవర్గాల పరిధిలో రెండో విడత ర్యాండమైజేషన్‌లో 888 మంది ప్రిసైడింగ్ అధికారులు, 888 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 1,776 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారుల ప్రక్రియ పూర్తి చేశామని వివరించారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఈ-డిస్ట్రిక్ మేనేజర్ సునీల్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నిక విధులపై అవగాహన ఉండాలని ఆర్వో, ఆర్డీవో రాములు సూచించారు. మంచిర్యాల నియోజకవర్గ సెక్టార్ అధికారులకు జిల్లా సైన్స్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై మాస్టర్ ట్రైనర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు వి.రాములు, హరికృష్ణతో కలిసి గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్లతో శుక్రవారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సమన్వయంతో పనిచేసి వరిధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని కల్లాల్లో శుభ్రపర్చుకుని, తప్ప,తాలు, మట్టిగడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు సందేహాలు, ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ 6203928682 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రకృతిలోనే ఆవిష్కరణలు

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅర్బన్: ప్రకృతిలోనే అనేక ఆవిష్కరణలు ఉంటాయని, పరిశీలిస్తే సమస్యలు పరిష్కరించే ఆవిష్కర్తలుగా విద్యార్థులు మారతారని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా సైన్స్ కేంద్రంలో 15 రోజులపాటు నిర్వహించే సైన్స్ సమ్మర్ క్యాంపును శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆవిష్కరణలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. ఆదిమానవుడి నుంచి ఆధునిక మానవుని వరకు మానవులు ఎదుర్కొన్న సమస్యలకు పరిష్కారం కనుగొనడమే ఇన్నోవేషన్ అన్నారు. పుస్తకాల్లో నేర్చుకున్న సిద్ధాంతపరమైన విషయాలను ఇక్కడ నేర్చుకునే ప్రయోగాత్మక విషయాలను అన్వయించుకుని విషయ అగాహన ఏర్పర్చుకోవాలన్నారు. భవిష్యత్తులో జిల్లా సైన్స్ సెంటర్‌కు అనుబంధంగా జిల్లా సైన్స్ మ్యూజియం, పార్క్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేసి సైన్స్ విద్యార్థులకు చేరువ చేస్తామన్నారు. డీఈవో యాదయ్య మాట్లాడుతూ వేసవిలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ విద్యార్థులు సైన్స్ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి రోజు రోబోటిక్స్ ఆటోమేషన్‌పై విశాల్, బిబాక్స సీనియర్ రోబిటిక్ మెంటర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మధుబాబు, రిసోర్స్ పర్సన్ జాకీర్‌హుస్సేన్, తిరుపతి, రాజేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రచార సభలు విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్/నస్పూర్: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల, నస్పూరులో శనివారం వేర్వేరుగా నిర్వహించే ప్రచార సభలను విజయవంతం చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కోరారు. శనివారం సాయంత్రం 5 గంటలకు నస్పూర్ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీ శివారులో, 6 గంటలకు మంచిర్యాల బైపాస్ రోడ్డులోని రిజిస్ట్రేషన్ కార్యాలయం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు సభల ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. తర్వాత మాట్లాడారు. కార్మిక గర్జన పేరుతో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్‌మున్షి, యూత్ కాంగ్రెస్ ఆలిండియా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరవుతారని వివరించారు. ఎన్నికల్లో గెలుపు కోసం బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన మూడున్నర నెలల్లోనే నియోజకవర్గంలో రూ.200 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేయడంతోపాటు, ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, చిట్ల సత్యనారాయణ, నస్పూరు మున్సిపల్ చైర్మన్ వేణు, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, నాయకులు బండారు సుధాకర్, శీపతి మల్లేశ్, తాళ్ల సంపత్, కాంగ్రెస్ మంచిర్లాయ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, కొండ శేఖర్, బండారు సుధాకర్, సిరిపురం రాజేశ్, రామగిరి బానేశ్ పాల్గొన్నారు.

సీఏఆర్ హెడ్‌క్వార్టర్‌ను పరిశీలించిన డీసీపీ



పోలీసు క్వార్టర్లను పరిశీలిస్తున్న డీసీపీ, ఏసీపీలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సీఏఆర్ పోలీసు హెడ్ క్వార్టర్‌ను మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. హెడ్‌క్వార్టర్‌లో ఉన్న ఖాళీ క్వార్టర్లను తనిఖీ చేశారు. హెడ్ క్వార్టర్‌లో 300 పైచిలుకు క్వార్టర్లు నిర్మించారని, వీటిలో కొన్ని మరమ్మతులు చేపట్టక శిథిలావస్థకు చేరుకోగా, మెజార్టీ క్వార్టర్లు నివాస యోగ్యంగానే ఉన్నట్లు అధికారులు డీసీపీకి వివరించారు. కొన్ని క్వార్టర్లకు మరమ్మతులు చేయించాల్సి ఉందని తెలిపారు. హెడ్‌క్వార్టర్‌ను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటామని, సిబ్బందికి క్వార్టర్లు అందుబాటులో ఉంచి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తామని డీసీపీ పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో బందోబస్తుకు వచ్చే కేంద్ర పోలీసు బలగాలు ఉండేందుకు అనుకూల అవకాశాలు ఉన్నట్లు సూచన ప్రాయంగా తెలిపారు. తర్వాత సింగరేణి ఎల్లెందు క్లబ్, బుధాగెస్ట్ హౌస్‌కు వెళ్లి పరిశీలించారు. డీసీపీ వెంట బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్, ఏఆర్ ఏసీపీ నరేందర్, ఆర్ఐ వామన్, ఎంటీవో సంతోష్, టూటౌన్ ఎస్సై రమేశ్ తదితరులు ఉన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ చేసిన డీసీపీ

బెల్లంపల్లి మున్సిపల్ శివారు పోశమ్మగడ్డ చౌరస్తా వద్ద టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ)-3 చెక్‌పోస్టును మంచిర్యాల డీసీ పీ అశోక్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. చె క్‌పోస్టు మీదుగా బెల్లంపల్లి నుంచి గ్రామీణ ప్రాంతాలకు, గ్రామీణ ప్రాంతాల నుంచి బె ల్లంపల్లి రాకపోకలు సాగించే వాహనాలను స్వ యంగా తనిఖీ చేశారు. చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహించే తీరు తెన్నులు పరిశీలించారు. ఎన్నికల వేళ కట్టుదిట్టంగా తనిఖీలు చేయాలన్నారు. బాధ్యతాయుతంగా పనిచేసి ఎన్నికలు సజావుగా జరగడానికి తోడ్పడాలని సూచించా రు. డీసీపీ వెంట బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై రమేశ్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు

జన్నారం: మండలంలోని దేవునిగూడ గ్రామానికి చెందిన అల్లి నాగయ్య శుక్రవారం అడవి పంది దాడిలో గాయపడ్డాడు. బాధితుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లి నాగయ్య ఉదయం తన పొలం వద్దకు వెళ్లాడు. పనులు చేసుకుని తిరిగి వస్తుండగా అడవి పంది దాడి చేసింది. ఈఘటనలో పక్కటెముకలు విరిగిపోయాయి. సమీపంలోని రైతులు గమనించి పందిని అదలగొట్టి బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నూతనంగా నిర్మిస్తున్న క్యాతనపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి అనే వ్యక్తికి గాయపడ్డాడు. తిరుపతి ద్విచక్రవాహనంపై ఆర్‌కేపీ నుంచి మంచిర్యాలవైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తిరుపతి తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు రెఫర్ చేశారు.

సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీ(షిర్కే)కి చెందిన మేడ మహేశ్(55) శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేకే–5 గనిలో సర్ఫేస్ మజ్దూర్‌గా విధులు నిర్వహించే మహేశ్ తాగుడుకు బానిసై సుమారు మూడు నెలలుగా విధులకు వెళ్లడం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో కూర బాగాలేదని భార్య పద్మతో గొడవ పడ్డాడు. వాళ్ల కుమారుడు శ్రావణ్ గొడవ వారించేందుకు తల్లిని తీసుకుని బయటకు వెళ్లాడు. ఇంట్లో ఉన్న మహేశ్ ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. కాసేపటి తర్వాత వచ్చి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


బెల్లంపానకం పారబోస్తున్న అధికారులు

నెన్నెల: మండలంలోని చిన్న, పెద్దలంబాడి తండాల శివారులోని గుడుంబా స్థావరాలపై చెన్నూర్ ఎక్సైజ్, నెన్నెల పోలీసులు సంయుక్తంగా శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మామిడి తోటల్లో డ్రమ్ములలో పాతిపెట్టిన 1900 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. చిన్నతండాకు చెందిన నాటుసారా తయారీదారులు ధరావత్ తిరుమల్, ధరావత్ దేవేందర్‌పై కేసులు నమోదు చేసినట్లు చెన్నూర్ ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. గుడుంబా తయారు చేసిన, విక్రయించిన పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదిలాబాద్ సీఐ గంగారెడ్డి, మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, నెన్నెల ఎస్సై కుందారపు ప్రసాద్, మంచిర్యాల, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, చెన్నూర్ ఎక్సైజ్ సీఐ, ఎస్సైలు, 20 మంది ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

‘పీడీ’కిలి బిగిస్తున్నారు!



- చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసుల దృష్టి
- తరచూ నేరాలకు పాల్పడేవారిపై ప్రయోగం
- యాక్ట్ నమోదైతే ఏడాది జైలు
- జాబితా సిద్ధం చేస్తున్న జిల్లా పోలీసులు

మంచిర్యాలక్రైం: కరుడుగట్టిన నేరగాళ్లు.. గంజాయి.. బెల్లం.. ఇసుక.. పీడీఎస్ రైస్ అక్రమ రవాణా.. దొంగతనాలు.. చైన్ స్నాచర్లు.. మహిళలను వేధించేవారు.. భూ అక్రమణదారులు.. పేకాట రాయుళ్లు ఇలా చెప్పుకుంటూపోతే మరెన్నో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నవారిపై రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు ప్రత్యేక దృష్టిసారించారు. నేర రహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో తరచూ నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈమేరకు ఇప్పటికే 10 మంది జాబితా సిద్ధం చేశారని సమాచారం. రామగుండం సీపీగా వి.సత్యనారాయణ ఉన్న సమయంలో 35 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు.

ఏడాది జైలు..

ఒక్కసారి పీడీ యాక్ట్ నమోదైతే ఏడాదిపాటు జైలు జీవితం గడపాల్సిందే. నేరం చేసినవాళ్లు జైలు నుంచి త్వరగా బయటకు రాకుండా చేస్తే నేరాలు తగ్గుముఖం పడతాయని పోలీస్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే నేరగాళ్లను పట్టుకున్న సమయంలో వారి పూర్తి వివరాలు సేకరించటం, జైలుకు వెళ్లిన నిందితుడు బయటకు రాకముందే కేసుల్లో సాక్ష్యాలు సేకరించి కేసులను ట్రయల్‌కు తీసుకువస్తే అనుకున్న ఫలితాలు రాబట్టవచ్చని పోలీస్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. నేరస్తులను కోర్టులో హాజరు పర్చడమే కాకుండా కేసులను త్వరగా పూర్తి చేసేలా కోర్టు కానిస్టేబుళ్లకు ఆదేశాలిచ్చారు. ఈమేరకు ప్రత్యేక తర్ఫీదు కూడా ఇస్తున్నారు.

19 రకాల నేరాలపై దృష్టి..

పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు ప్రధానంగా 19 రకాల నేరాలపై పోలీసులు దృష్టిపెట్టారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు గంజాయి, పీడీఎస్ రైస్, గుట్కా, కలప స్మగ్లింగ్, ఇసుక రవాణా, భూ మాఫియా, దొంగతనాలకు పాల్పడినవారిపైనే పీడీ యాక్టు నమోదైంది. అక్రమ వ్యాపారులు, అంతరాష్ట్ర దొంగలు, మాదకద్రవ్యాల సరఫరా, గూండాలు, మనుషుల అక్రమ రవాణా, నకిలీ విత్తనాల దందా, నకిలీ పురుగు మందుల దందా, ఎరువుల అక్రమ రవాణా, కల్తీ ఆహారం, నకిలీ డాక్యుమెంట్లు, బెట్టింగ్ నిర్వాహకులు, పేలుడు పదార్థాల సరఫరా, ఆయుధాల రవాణా, సైబర్ నేరాలు, వైట్ కాలర్ నేరాలు, దొంగతనాలు, మహిళను వేధించడం, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నవారిపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు తీసుకుంటున్నారు.

పీడీ యాక్ట్‌తో నేరాలు తగ్గుముఖం..



వరుస నేరాలకు పాల్పడుతున్నవారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తే ఏడాదిపాటు జైలుశిక్ష అనుభవించాల్సిందే. దీంతో నేరాలు తగ్గుముఖం పడతాయి. కొందరు నేరాలు చేస్తూ బెయిల్‌పై వచ్చి తిరిగి నేరాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు చేపడుతున్నాం. ఈమేరకు జాబితా సిద్ధం చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే 35 మందిపై పీడీ యాక్ట్ నమోదైంది. మరో 10 మంది జాబితా సిద్ధంగా ఉంది.

– ఎం. శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి నమోదైన కేసుల వివరాలు...

నేరం	కేసులు	అరెస్ట్	స్వాధీనం చేసుకున్న గంజాయి
గంజాయి	14	42	13.228 కిలోలు
పీడీఎస్ రైస్	48	70	969,05 క్వింటాళ్లు
ఫైనాన్స్	23	24	---
పేకాట	27	184	రూ. 22,15,260
ఇసుక	40	87	రూ. 4,38,400 విలువగల..



రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి


నర్సింహ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


చికిత్స పొందుతున్న నిఖిల్

- రక్తసిక్తమైన పోతపల్లి– కోర్తేగూడ రహదారి
- ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొట్టడంతో ప్రమాదం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


మహేశ్(ఫైల్)


వెంగల్‌రావు(ఫైల్)


నర్సింహ(ఫైల్)

బెజ్జూర్(సిర్పూర్): బెజ్జూర్ మండలం పోతపల్లి–కోర్తేగూడ రోడ్డు రక్తసిక్తమైంది. గురువారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలం అర్కగూడకు చెందిన ఆత్రం మహేశ్(25), బారేగూడకు చెందిన తొర్రెం వెంగల్‌రావు(30) బూర్గుగూడలో గురువారం జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. అక్కడి నుంచి బారేగూడకు వెళ్లి మళ్లీ బైక్‌పై బూర్గుగూడకు బయలుదేరారు. ఈ క్రమంలోనే బెజ్జూర్ మండలం ఎల్కపల్లికి చెందిన దున్న నర్సింహ (20), అయిల్ల నిఖిల్, రాజ్‌కుమార్ బారేగూడ వైపు వివాహానికి వెళ్తున్నారు. వీరి బైక్‌లు పోతపల్లి, కోర్తేగూడ మధ్య గురువారం అర్ధరాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆత్రం మహేశ్, తొర్రెం వెంగల్‌రావు, దున్న నర్సింహ అక్కడికక్కడే మృతి చెందారు. నిఖిల్, రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

కుటుంబాల్లో తీరని విషాదం

ముగ్గురి మరణం మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. బారేగుడకు చెందిన కొర్రం వెంగల్‌రావుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. వ్యవసాయ కూలీ పని చేస్తూ ఆయన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దున్న నర్సింహ తల్లి చిన్నతనంలో మరణించింది. ఆయన ఎల్కపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఇంట్లో ఉంటున్నాడు. చేతికందిన కొడుకు కానరాని లోకాలకు వెళ్లడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. అర్కగూడ గ్రామానికి చెందిన ఆత్రం మహేశ్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

కాగజ్‌నగర్‌కు క్షతగాత్రులు

ఆయిళ్ల నిఖిల్ తలకు బలమైన గాయం కావడంతో కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రాజ్‌కుమార్ కాలు విరగడంతో సర్జరీ అవసరం ఉంటుందని వైద్యులు తెలిపారు. వీరు శుభకార్యానికి వెళ్లేందుకు స్నేహితుల వద్ద బైక్ అడిగి తీసుకొని వెళ్లి ప్రమాదం బారిన పడ్డారు.

ఘటనా స్థలిని పరిశీలించిన డీఎస్పీ

పోతపల్లి, కోర్తెగూడ గ్రామాల మధ్య గురువారం అర్ధరాత్రి ప్రమాదం జరిగిన స్థలాన్ని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ శుక్రవారం సందర్శించారు. సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలను సైతం పరిశీలించారు. ఆయన వెంట బెజ్జూర్ ఎస్సై విక్రం తదితరులు ఉన్నారు.

బీజేపీలో సమన్వయకర్తలు

- పార్లమెంట్ సెగ్మెంట్ వారీగా నియామకం
- ఆదిలాబాద్‌కు ప్రదీప్‌కుమార్, పెద్దపెల్లికి సుహాసినిరెడ్డి
- పార్టీ ఎమ్మెల్యేలకు ఇన్‌చార్జి బాధ్యత తొలగింపు


ప్రదీప్‌కుమార్


సుహాసినిరెడ్డి

సాక్షి,ఆదిలాబాద్: బీజేపీ పార్లమెంట్ సెగ్మెంట్ వారీగా సమన్వయకర్త (కోఆర్డినేటర్)లను నియమించింది. ఆదిలాబాద్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ రావును, పెద్దపెల్లికి జెడ్పీ మాజీ చైర్ పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డిలకు బాధ్యతలు అప్పగించింది. ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలను ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, అందరినీ సమన్వయం చేసుకుంటూ నిర్వహించాలని ఆదేశించింది. మొత్తంగా ఈ పరిణామం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకే పరిమితం..

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మొదట బీజేపీ పరంగా సెగ్మెంట్ వారీగా ఇన్‌చార్జీలను నియమించింది. వారి పర్యవేక్షణలోనే ఆ పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఎన్నికల నిర్వహణ జరిగేలా ఆదేశాలు ఇచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు ఉండగా, బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు ఆదిలాబాద్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు పెద్దపెల్లి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల బాధ్యతలు అప్పట్లో ఇచ్చారు. తాజాగా పార్లమెంట్ కోఆర్డినేటర్లను నియమించడంతో ఇన్‌చార్జీలను తొలగించినట్టేనని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు ఇక తమ నియోజకవర్గానికే పరిమితం కావాల్సింటుంది.

సమన్వయ లోపమేనా..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండగా, బీజేపీ పరంగా ఈ నిర్ణయం వెలువడటం ఆ పార్టీలో ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై రకరకాల చర్చలు సాగుతున్నాయి. ప్రధానంగా ఎమ్మెల్యేలను ఇన్‌చార్జీలుగా నియమించిన తర్వాత ఆయా పార్లమెంట్ సెగ్మెంట్ల పరిధిలో సమన్వయ లోపం ఎదురైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఇటీవల జరిగిన సంఘటనలు పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లడంతో తక్షణం ఈ చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నామినేషన్ల ఘట్టం తుది అంకానికి చేరింది. మే 13న ఎన్నికలు ఉండగా, మరికొద్ది రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ నియోజకవర్గాల్లో సమన్వయకర్తను నియమించి వారి ద్వారా అందరు నేతలను కోఆర్డినేట్ చేసుకోవాలని ఆదేశించింది. ఈ పరిణామాలను పార్టీ శ్రేణులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

వివాహానికి వెళ్తూ.. మృత్యు ఒడికి..

- నేషనల్ హైవేపై స్కూటీని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం
- ఒకరు మృతి.. మరొకరి గాయాలు


భిక్షపతి మృతదేహం

రెబ్బెన(ఆసిఫాబాద్): బంధువుల ఇంట్లో వివాహం ఉందని స్నేహితుడితో కలిసి పయనమైన అతడిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు బలి తీసుకుంది. పది నిమిషాల్లో గమ్యానికి చేరుతాం అనుకునే లోపే గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రాణాలు కోల్పోయడు. ఈ ఘటన శుక్రవారం రెబ్బెన మండలం ఇందిరానగర్ వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్(టి) మండలం చీలపెల్లికి చెందిన వసాక భిక్షపతి (29) అదే గ్రామానికి చెందిన గుర్లె పరుశురాంతో కలిసి స్కూటీపై రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలోని బంధువుల ఇంట్లో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు బయలుదేరారు. మార్గమధ్యలోని ఇందిరానగర్ సమీపంలో వీరి స్కూటీని వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. భిక్షపతితోపాటు పరశురాంకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన రెబ్బెన మండల కేంద్రంలోని పీహెచ్‌సీ తరలించి చికిత్స అందించారు. భిక్షపతి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి గిరిజాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- విద్యుత్‌శాఖ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న వరుణ్ రెడ్డి

మంచిర్యాల అగ్రికల్చర్: జిల్లాలో హెచ్చు తగ్గులు, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని విద్యుత్‌శాఖ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓ అండ్ ఎం సిబ్బంది అవగాహన, శిక్షణ కార్యక్రమానికి విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషారావుతో కలిసి హాజరయ్యారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్ పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈదురు గాలుల కారణంగా విద్యుత్‌తీగలు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పరిశ్రమలు, నివాస గృహాలు ఇతరత్రా అన్ని కేటగిరీలకు నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరమ్మత్తులు జరిగే ప్రాంతాలలో ముందస్తుగా విద్యుత్ సరఫరా నిలిపివేసే సమయాన్ని తెలియజేయాలన్నారు. చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు, దరఖాస్తులపై తక్షణం స్పందించాలి

- పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీర్ నైరంతర్య


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: లోక్‌సభ ఎన్నికల సంబంధిత ఫిర్యాదులు, దరఖాస్తులపై తక్షణమే స్పందించి భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు సమీర్ నైరంతర్య అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల ఆర్డీవో వి.రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రకళతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం, సి–విజిల్, వీడియో పరిశీలన, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, వెబ్ కాస్టింగ్, మీడియా సెంటర్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పరిశీలకులు మాట్లాడుతూ కంట్రోల్ రూమ్, సి–విజిల్, టోల్ ఫ్రీం నెంబర్1950 ద్వారా అందిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికల విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ కమిషనర్ వినీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో లైకా అంత్యక్రియలు


నివాళులర్పిస్తున్న డీసీపీ అశోక్‌కుమార్

బెల్లంపల్లి: కమిషనరేట్ ఆర్మ్డ్ రిజర్వుడ్ (సీఏఆర్) బెల్లంపల్లి పోలీసు హెడ్‌క్వార్టర్‌లో ఉన్న పోలీసు శునకం లైకా శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. 2023లో లైకా క్యాన్సర్ బారినపడింది. గర్భసంచికి క్యాన్సర్ గడ్డలు ఏర్పడడంతో అదే ఏడాది జులై నెలలో శస్త్రచికిత్స చేయించారు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స జరుగుతోంది. మందుల వాడకంతో ఉత్సాహ పూరితంగా ఉన్న లైకా ఆరోగ్యం ఇటీవలి క్షీణించింది. శుక్రవారం తుది శ్వాస విడిచింది. మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్, ఏఆర్ ఏసీపీ నరేందర్, ఆర్ఐ వామన్, డ్వాగ్ స్క్వాడ్ సిబ్బంది, సాయుధ పోలీసులు లైకాకు నివాళులర్పించారు. పోలీసు సంప్రదాయ పద్ధతిలో స్మృతి గాడ్ సమర్పించారు. అనంతరం హెడ్ క్వార్టర్ ఆవరణలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఏఆర్ హెడ్ క్వార్టర్ ఎంటీవో సంతోష్, బెల్లంపల్లి డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి వేణుగోపాల్, పర్యవేక్షకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించి...

2014 సంవత్సరంలో జన్మించిన లైకా మోహినాబాద్ పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ పొందింది. పది నెలల వయస్సు ఉండగా 2015లో బెల్లంపల్లి ఏఆర్ పోలీసు హెడ్ క్వార్టర్‌కు కేటాయించారు. ఆరు నెలలపాటు శిక్షణ తీసుకున్నాక ఆ సమయంలో పేలుడు పదార్థాలను పసి గట్టడంలో చూపిన నేర్పుకుగాను లైకా రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించింది. పోలీసు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్న లైకా బెల్లంపల్లికి వచ్చాక పోలీసు యంత్రాంగానికి సేవలు అందించింది. హైదరాబాద్‌కు రాష్ట్రపతి విడిదికి వచ్చిన ప్రతీసారి లైకా వెళ్లి తనవంతు బందోబస్తు సేవలు అందించేది. మేడారం సమ్మక్క, సారక్కల జాతరలోనూ చురుకుగా వ్యవహరించింది.


లైకా డాగ్ (ఫైల్)

రక్షణ సూత్రాలు పాటించాలి


మాట్లాడుతున్న రఘుకుమార్

కాసిపేట: అన్నిరంగాల్లో రక్షణ సూత్రాలను పాటిస్తూ ముందుకు సాగాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్ సూచించారు. మందమర్రి ఏరియా కాసిపేట గని ఉద్యోగులకు రక్షణ సూత్రాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు సైతం ఎక్కువగా జరుగుతున్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ప్రతీ కార్మికుడు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. మొదటిసారి గనికి వచ్చిన సేఫ్టీ జీఎంను ఏఐటీయూసీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో గని మేనేజర్ భూశంకరయ్య, విజయ్‌కుమార్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, పిట్ సహాయ కార్యదర్శి పార్వతి సురేశ్, నాయకులు ఆడెపు రవీందర్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

యూటర్న్ మూసివేయొద్దని ఆందోళన

బెల్లంపల్లి: జాతీయ రహదారిపై కన్నాల శివారులోని యూటర్న్ మూసివేయొద్దని తిరుమలహిల్స్ టీచర్స్ కాలనీ వాసులు శుక్రవారం ఆందోళన చేశారు. యూటర్న్ మూసివేయడానికి చేస్తున్న యత్నాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తిరుమల హిల్స్ కాలనీ గౌరవ అధ్యక్షుడు వేణు, అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ కాలనీలో నివాసం ఉంటున్న ప్రజల సౌలభ్యం కోసం యూటర్న్ ఏర్పాటు చేశారని తెలిపారు. యూటర్న్ మూసివేస్తే తాము ఇబ్బంది పడతామని పేర్కొన్నారు. బెల్లంపల్లికి వెళ్లడానికి కిలోమీటర్ల దూరం వెనక్కివెళ్లాల్సి వస్తుందని తెలిపారు. యూటర్న్ ఎత్తి వేయడం అనివార్యమైతే తమకు ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. సర్వీసు రోడ్డును ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

బీజేపీలో చేరిన మార్కెట్ మాజీ చైర్మన్


శ్రీనివాస్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి


కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరుతున్న శ్రీపతి

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ బిగ్ షాక్ తగిలింది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తుల సమ్మయ్య, ముగ్గురు కౌన్సిలర్లు కమ్మల శ్రీనివాస్, గర్రెపల్లి శాంతవెంకటనర్సయ్య, జాడి సురేఖతిరుపతి, జైపూర్ మండలం నర్వ మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్ బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వేరబెల్లి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ దుర్గం అశోక్, అక్కల రమేశ్, ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన రామగిరి శ్రీపతి

మంచిర్యాలటౌన్: అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు, బెల్లంపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేసిన రామగిరి శ్రీపతి శుక్రవారం బీజేపీలో చేరారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, దూట రాజ్‌కుమార్, మేడి రాజశేఖర్, చిన్నూరు ప్రశాంత్ రెడ్డి, కోడి కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సీఎస్ఐ చర్చి జాతర


చర్చి జాతరకు వచ్చిన భక్తులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో ఏసుక్రీస్తు పునరుత్థాన మహోత్సవ ప్రాంతీయ జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో చర్చి జాతరకు తరలివచ్చారు. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తుల కోసం చర్చి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఫాదర్ డెవిడ్ పాల్ ప్రత్యేక సందేశాన్ని అందించారు. సీఐ నరేందర్, ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.